
2 మైళ్ళ ముది బోర్డర్
MVS
మధుబాబు

# 2 మైల్స్ టు ది బోర్డర్

రచన

మధుబాబు

Kinige

© Author
© Madhu Baabu
This digital book is published by -
కినిగె డిజిటల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్.

సర్వ హక్కులూ రక్షించబడ్డాయి.

All rights reserved.

No part of this publication may be reproduced, stored in a retrieval system or transmitted in any form or by any means electronic, mechanical, photocopying, recording or otherwise, without the prior written permission of the author. Violators risk criminal prosecution, imprisonment and or severe penalties.

# 2 మైల్స్ టు ది బోర్డర్

"హెచ్చరిక! దియోదార్ పట్టణ ప్రజలందరికీ ఒక హెచ్చరిక!! గజదొంగ షాడో మన పట్టణంలో అడుగుపెట్టినట్లు తెలుస్తోంది ప్రజలందరూ అప్రమత్తతగా వుండవలసిందిగా కోరుతున్నాం..." చెవులు చిల్లులు పడేటట్లు ఎనౌన్స్ చేస్తూ వేగంగా దూసుకుపోయింది పోలీస్ వాన్.

ఎప్పుడు చూసినా నిద్రపోతున్నట్లు కనిపించే దియోదార్ సిటీలో చలనం వచ్చింది ఒక్కసారిగా.

గుంపులు గుంపులుగా రోడ్లమీద గుమికూడటం ప్రారంభించారు పౌరులు. కర్రలు, కత్తులు పట్టుకొని వీధుల్లో పహారా తిరగటం మొదలుపెట్టారు.

"ఓ బద్మాష్ ఇధర్ ఆయేతో ఫిర్ బహర్ మత్ జాయేగా!" పొడుగాటి గడ్డాన్ని సవరించుకుంటూ తన అభిప్రాయాన్ని వెల్లడించాడు బాల్ పట్టీ సెంటర్లో నిలబడి వున్న ఒక నవాబు.

లావాటి కర్రల్ని పట్టుకొనివున్న అతని స్నేహితులు కొందరు తలలు వూపారు అతని అభిప్రాయంతో ఏకీభవిస్తూ.

ఒక టీ బంక్ దగ్గిర నిలబడి వేడి వేడి టీని ఆర్చుకు ఆర్చుకు తాగుతున్నాడు జాన్ పీటర్స్. నవాబు మాటల్ని వినేసరికి కొండరాయి పడినట్లయింది అతని గుండెలమీద.

షాడోని కలుసుకోవటం కోసం రెండు నెలలనుంచీ తిరిగిన వూరు తిరక్కుండా గుజరాత్ రాష్ట్రం అంతా గాలిస్తున్నాడు అతను. తన కోరిక తీరకుండానే కొంపతీసి పట్టుబడిపోడుకదా ఆ షాడో!

“ఆ మాట అనుకొనేసరికి అక్కడ నిలబడ బుద్ధి కాలేదతనికి. తాగుతున్న టీని అలాగే వదిలేసి ముందుకు కదిలాడు.

అదే సమయంలో లాల్ పట్టీ సెంటర్‌కి ఉత్తర దిశలో చెలరేగింది కలకలం.

“చోర్! చోర్!! పకడో... పకడో...” అన్న అరుపులు వినబడసాగాయి.

“ఆగయా రే... షాడో ఆగయా... సేట్ టిమిటీలాల్ హవేలీ ఖతమ్ హోగయా...” అని కేకలుపెడుతూ పరిగెత్తుకు వచ్చారు నలుగురు పౌరులు.

గొల్లుమన్నారు లాల్ పట్టీ సెంటర్లో నిలబడివున్న జనం. రెండో ఆలోచన లేకుండా టిమిటీలాల్ ఇంటివైపు పరుగులు తీశారు.

వేగంగా కొట్టుకుంటున్న గుండెలతో చుట్టూ చూశాడు జాన్ పీటర్స్.

ఆవేశం తప్ప ఆలోచనలేదు దియోదార్ పౌరులకు. సందుగొందుల్ని జాగ్రత్తగా కవర్ చేయటం మరిచిపోయి ఒకే చోటికి పోతున్నారు కట్టకట్టుకొని...

షాడోని గురించి తనకు తెలిసిన విషయాలన్నిటినీ మననం చేసుకుంటూ తూర్పుదిశగా అడుగులు వేశాడు జాన్ పీటర్స్. తన అదృష్టం బాగుంటే ఆ దిశలోనే దొరకాలి షాడో... అదృష్టం బాగోకపోతే_

హఠాత్తుగా ఆటంకం కలిగింది అతని ఆలోచనలకు.

ఒక సందు మొగదలవున్న కరెంట్ స్తంభం చాటు నుంచి యివతలికి వస్తూ అతనికి కనిపించాడు ఒక వ్యక్తి.

పొట్టిగా లావుగా వున్నాడతను. పిచ్చివాడిలా తల ప్రక్కకు వంచి అడుగులు వేస్తున్నాడు.

"అగ్గిపెట్టె వుంటే కొంచెం యిప్పించు భాయీ సాబ్..." సగం కాలి ఆరిపోయిన సిగరెట్ పీకను నోట్లో పెట్టుకుంటూ చేయి జాచాడతను.

రెండో ఆలోచన లేకుండా అగ్గిపెట్టెను అందించాడు జాన్ పీటర్స్.

"భయంకరంగా వుంది భాయీ సాబ్ ఈ రాత్రి... ఎట్లా తెల్లారుతుందో ఆ భగవంతుడికే తెలియాలి..." అంటూ సిగరెట్ వెలిగించుకొని, తాపీగా ఎదురుగావున్న యింకో సందులోకి పోయాడా పొట్టిమనిషి.

షాడోని గురించిన ఆలోచనలతో సతమతం అవుతూ ముందుకు కదిలిన జాన్ పీటర్స్ చెవులకు అస్పష్టంగా చేరింది అతను పాడుతున్న పిచ్చిపాట.

*రెవికె ముడి వీడెనో పిల్లోపిల్లో*

*పమిటె పడిపోయెనే పిల్లోపిల్లో*

*చెయ్యూగె నడుమూగె చేమంతులూగె.*

*పడుచువాడీ గుండె పరవళ్ళుతొక్కె.*

లాగిపెట్టి ఎవరో ముఖంమీద చరిచినట్లు ఉక్కిరిబిక్కిరి అవుతూ నెత్తిమీద టపటపా చరుచుకున్నాడు జాన్ పీటర్స్.

మైగాడ్! గంగారాం గొంతు అది!!

షాడో ఉన్నచోట గంగారాం వుంటాడు. గంగారాం కనిపించిన వందగజాల దూరంలోనే ఖచ్చితంగా కనిపించి తీరతాడు ఆ షాడో!!!

వేగంగా వెనుతిరిగి గంగారాం అడుగుపెట్టిన సందులోకి పరుగుతీశాడు. పది అడుగులుకూడా వేయకముందే బ్రేకులు పడినట్లు ఆగిపోయాయి అతని పాదాలు.

సందు మధ్యలో ఒక యింటి ముందు ఆగివున్నాడు గంగారాం. నిగనిగ మెరుస్తున్న రివాల్వర్లను పట్టుకొని అతన్ని కమ్ముకుంటున్నారు పాతికమంది పోలీసులు.

## 2

"ఎవరు నువ్వు? అర్ధరాత్రివేళ ఏం చేస్తున్నావ్ యిక్కడ?" కరకరలాడుతున్న కంఠంతో కరుకుగా ప్రశ్నించాడు యిన్స్పెక్టర్.

"ఆయారాం గయారాం అంటారు సాబ్ నన్ను... ఒక అడ్రసు కోసం అవస్థలు పడుతున్నాను." వినయంగా చేతులు కట్టుకొని సమాధానం యిచ్చాడు గంగారాం.

"అబే కుత్తేకి బచ్చే... వేళాకోళంగా వుందా? అయ్యగారు అడిగిన ప్రశ్నకు సమాధానం సరిగ్గా చెప్పుబే..." పొడుగాటి లాటీకర్రను అతని మెడమీద ఆనిస్తూ క్రూరంగా హెచ్చరించాడు ఒక కానిస్టేబుల్.

శరవేగంతో ఆలోచించాడు గంగారాం. వెనుకా ముందూ చూసుకోకుండావచ్చి వాళ్ళమధ్య చిక్కుపడ్డాడు తను... గోల కాకుండా బయటపడటం ఎలా?

"సమాధానం చెప్పమంటే గుడ్లు మిటకరిస్తావేమిటిబే?" గంగారాం చొక్కా పట్టుకొని ముందుకు లాగుతూ మరింత కౄరంగా అడిగాడు ఆ కానిస్టేబుల్.

అదేసమయంలో ప్రక్కనేవున్న యింట్లో చెలరేగింది చిన్నసైజు కలకలం.

"చచ్చిపోతున్నాను... నేను చచ్చిపోతున్నాను నాయనోయ్!" అంటూ వినవచ్చిందొక ఆడకంఠం.

కాళ్ళ క్రింద నిప్పులు పోసినట్లు ఎగిరిపడ్డారు పోలీసులు అందరూ. కట్టకట్టుకొని, ఆ యింటి ముందుకు దూకారు.

"ఎవరు లోపల? తలుపులు తెరవండి..." లాటీకర్రతో తలుపుల్ని బాదుతూ బిగ్గరిగా పిలిచాడు యిన్స్‌పెక్టర్.

రెండు క్షణాల్లో తెరుచుకున్నాయి తలుపులు. ఆత్రుత ఆందోళనలతో బయటికి తొంగిచూసింది ఒక మధ్య వయస్కురాలు.

"నా మనవరాలికి పురిటినొప్పులు వస్తున్నాయి... డాక్టర్ గారి కోసం పోయిన మా వాళ్ళు యింకా తిరిగి రాలేదు." సందు మొగదలకుచూస్తూ, చేతులు నులుముకుంటూ అన్నదామె.

అనుకోకుండా దొరికిన ఆ అవకాశాన్ని వెంటనే వినియోగించుకున్నాడు గంగారాం.

“డాక్టర్ గారి కోసం వచ్చింది మీ వాళ్ళేనా? రక్షించావు తల్లీ... ఇందాకటి నుంచీ మీ అడ్రసు తెలియక తన్నుకు చస్తున్నాను...” తడుముకోకుండా అంటూ, చొరవగా యింట్లోకి పోయాడు.

మా డాక్టర్ గారు వెనకాల వస్తున్నారు. ఆయన్ను కూడా నన్ను పట్టుకున్నట్లే పట్టుకున్నారంటే _ ఈ పాప పరిస్థితి చండాలం అయిపోతుంది. జాగ్రత్త భాయీసాబ్...” అని యిన్స్‌పెక్టర్‌ని హెచ్చరించి ముఖద్వారాన్ని ఠప్పున మూసేశాడు.

ఒకరి ముఖాలు ఒకరు చూసుకుంటూ వెనక్కి వచ్చారు పోలీసులు.

సందులో అడుగుపెట్టిన జాన్ పీటర్స్ నోరు తెరుచుకు చూస్తున్నాడు ఆ నాటకాన్ని, పోలీసులు వెనుతిరగగానే అతనికి తెలివివచ్చింది. ఖంగారుగా వెనుతిరిగి మళ్ళీ రోడ్డువైపు బయలుదేరాడు.

అప్పటికే ఆలస్యం అయిపోయింది.

“ఖడ్ జావ్! ఖడ్ జావ్!!” అని అరిచి ముందుకు దూకారు పోలీసులు.

పై ప్రాణాలు పైనే పోయినట్లు అయిందతనికి. వెనుకా ముందూ చూసుకోకుండా పిక్కబలం చూపించాడు.

ధన్ మని గర్జించింది ఒక రివాల్వర్.

“పారిపోతున్నాడు... బద్మాష్ పారిపోతున్నాడు... పకడో...పకడో...” అని అరుస్తూ వేటకుక్కల్లా వెంటపడ్డాడు పోలీసులు.

రివాల్వర్ మ్రోత వాళ్ళ అరుపులు అన్నీచేరి ఆ ప్రక్కవీధిలోవున్న జనానికి వినిపించాయి.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=1882**

* * *

**Read other books of Madhu Babu @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Madhu+babu&id=20**